క్లుప్తంగా

విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 33కేవీ కోమటి చెరువు సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌నగర్, శివాజీనగర్, శ్రీనగర్ కాలనీ, హౌజింగ్‌బోర్డు కాలనీ, హరిప్రియ నగర్, ప్రియదర్శిని నగర్, నాయకంనగర్, పాతబస్టాండ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్, ప్రాంతాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాలు నియంత్రిస్తాం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మానవ తప్పిదాల వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ చెప్పారు. మండల పరిధిలోని రామునిపట్ల వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద స్థలాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడుపడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతలు పడ్డాయని, వాటిని పూడ్చడానికి చర్యలు తీసుకుంటున్నామని, మెయిన్ రోడ్డుకు వచ్చే అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

30క్వింటాళ్ల బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న ఎస్‌ఐ ఆసిఫ్

నంగునూరు(సిద్దిపేట): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఎండీ ఆసిఫ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నాగరాజుపల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించగా అందులో 30క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. హన్మకొండకు చెందిన బుక్య గణేశ్, తరుణ్, మలోత్ రవికుమార్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి



స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేస్తున్న ఎంఈఓ

మిరుదొడ్డి(దుబ్బాక): అందివచ్చిన అవకాశాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జోగు ప్రభుదాసు కోరారు. మండల పరిధిలోని లింగుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ బాలకిషన్ సౌజన్యంతో విద్యార్థులకు శనివారం స్పోర్ట్స్ యూనిఫాంతో పాటు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పించడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ప్రవీణ్‌బాబు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా బాధ్యులు మహేందర్, ఎమ్మార్సీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ మురళి

చిన్నకోడూరు(సిద్దిపేట): గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్‌ఐ మురళి అన్నారు. శనివారం మండల పరిధిలోని మెట్‌పల్లిలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ కళాబృందం ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేదికకు తాళం.. రైతుల ఆగం



ఏఈఓ లేక మూతపడిన అక్కన్నపేట రైతు వేదిక

- వ్యవసాయ విస్తరణాధికారి బదిలీ
- కొత్తవారు రాకపోవడంతో మూత
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక మూడు రోజులుగా తలుపులకు తాళంవేసే దర్శనమిస్తోంది. ఇక్కడ పనిచేసిన వ్యవసాయ విస్తరణాధికారి సబియా ఇటీవల హుస్నాబాద్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో అప్పటి నుంచి ఈ రైతు వేదికకు తాళం పడింది. ఆమె స్థానంలో ఎవరూ రాకపోవడంతో రైతు వేదిక తెరుచుకోవడం లేదు. దీంతో రైతులు ఆగం అవుతున్నారు. రుణమాఫీ కాని రైతులు నేరుగా రైతు వేదికల్లో ఏఈఓలకు తమ వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. కాని ఈ రైతు వేదిక తాళం పడడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైతు వేదిక పరిధిలో రెండు, మూడు గిరిజనతండాలు ఉన్నాయి. ఆయా తండాల రైతులు ప్రతిరోజు వచ్చి తాళంవేసి ఉండడంతో వెనుదిరిగి వెళ్లి పోతున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి త్వరగా ఏఈఓను నియమించాలని రైతులు కోరుతున్నారు. ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి శ్రీయను సాక్షి సంప్రదించగా బదిలీపై ఇంకా ఎవరూ రాలేదని, రెండు రోజుల్లో రానున్నట్లు చెప్పారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

- ఉత్సాహంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



సిద్దిపేటఅర్బన్: చిన్నారులతో ఉపాధ్యాయులు



బెజ్జంకి గీతా ఆశ్రమ పాఠశాలలో ..



జగదేవ్‌పూర్(గజ్వేల్): చిన్నారుల నృత్యం

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని అన్ని మండలాల పరిధిలోని పాఠశాలల్లో శనివారం ముందస్తు సంబురాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం నుంచే పాఠశాలల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికలు, యశోదల వేషధారణలతో అలరించారు. కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు ఉట్లను కొట్టగా గోపికల వేషధారణలోని చిన్నారులు నీళ్లు చల్లి సందడి చేశారు. కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో వారు అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ నాయకులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు



హుస్నాబాద్: కోలాటం ఆడుతున్న చిన్నారులు



కోహెడ(హుస్నాబాద్): కృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థులు

విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లికార్జున్

హుస్నాబాద్: విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. శనివారం ఆయన మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలోని టాయిలెట్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ, తాగునీటి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనంతోపాటు విద్యకు కావల్సిన అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువుల కోసం బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలం ఎల్లం, వన మహోత్సవ సూపర్‌వైజర్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా బీఆర్‌ఎస్



బియ్యం అందజేస్తున్న అంజిరెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బోయిని నాగరాజు కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించారు. అనంతరం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ నుంచి రైస్‌మిల్లు వరకు రోడ్డుకు రెండువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను ఆయన ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లను కప్పేసిన చెట్ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, పెద్దబాబు, భూమరాజయ్య, మల్లయ్య, నర్సింహులు, దుర్గయ్య, మల్లేశం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి జరిమానా

గజ్వేల్‌రూరల్: వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి రెండు రోజులు జైలుశిక్ష, రెండు వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి శనివారం తెలిపారు. ఇటీవల పిడిచెడ్, క్యాసారం, తూప్రాన్, ముత్రాజ్‌పల్లి సంగాపూర్, ఔటర్ రింగ్ రోడ్డు చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు మద్యం సేవించి పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రియాంక విచారించి నలుగురికి జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

అట్రాసిటీ కేసుపై విచారణ



విచారిస్తున్న ఏసీపీ మధు

నంగునూరు(సిద్దిపేట): భూ తగాదా విషయమై రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును శనివారం సిద్దిపేట ఏసీపీ మధు విచారించారు. ముంద్రాయి గ్రామానికి చెందిన కల్లాటి గిరిబాబు భూమి విషయమై ఈనెల 3న అదే గ్రామానికి చెందిన రాములుతో వివాదం జరిగింది. దీంతో అట్రాసిటీ కేసు నమోదు కాగా ఎస్‌ఐ ఆసీఫ్‌తో కలసి ఆయన ప్రత్యక్ష సాక్షులను విచారించారు.

అన్నా.. జర పైలం



పరిమితికి మించి ప్రయాణిస్తున్న కూలీలు

పరిమితికి మించి పయనిస్తూ చాలా మంది ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. క్షణం ఆగలేకో.. చార్జీలు తగ్గుతాయని ఆశతోనో.. ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రజలు అధిక సంఖ్యలో ఎక్కి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బెజ్జంకి నుంచి సిద్దిపేట వైపుకు వెళ్తున్న ఓ మినీ గూడ్స్ వాహనంలో శనివారం సుమారు 30మంది కూలీలు ప్రయాణించారు. అధికలోడ్‌తో రాజీవ్ రహదారిపై ప్రయాణించడం ప్రమాదకరమని పోలీసులు పదేపదే చెబుతున్నా వినిపించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకొని ఓవర్‌లోడ్, రాంగ్ రూట్ ప్రయాణాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

అక్కన్నపేట(హుస్నాబాద్) / చిన్నకోడూరు(సిద్దిపేట) /హుస్నాబాద్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ పిలుపునిచ్చారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రతి చిన్నారికి చదువుకునే హక్కు ఉందని, విద్యార్థులందరూ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్‌భాస్కర్, పాఠశాల ప్రత్యేకాధికారి సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని గోనెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సెల్‌ఫోన్స్ అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలని, సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు పాల్గొననారు.

శానిటేషన్ చర్యలు మెరుగుపర్చాలి

- సర్వసభ్య సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన సభ్యులు కొన్ని తీర్మానాలు చేశారు. ప్రధానంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న క్రమంలో పట్టణ పరిధిలో శానిటేషన్ పనులు మెరుగుపర్చాలని సభ్యులు సూచించారు. అలాగే శానిటేషన్ సిబ్బందికి బట్టలు, సబ్బులు, నూనె, మాస్కులు అందించాలని, త్వరలో జరగనున్న బతుకమ్మ, దసరా వేడుకల సందర్భంగా చెరువు దగ్గర ఏర్పాట్ల కోసం జేసీబీతో మొరం పోయడం, తదితర అవసరాల కోసం ఆమోదం తెలిపారు. అలాగే బోనాల పండుగ ఏర్పాట్ల కోసం, పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు పెంచాలని సభ్యులు తీర్మానం చేసినట్లు కమిషనర్ నాగేందర్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు లింగం, నరేందర్, లీల, సురేశ్, తార, సతీశ్, కోఆప్షన్ సభ్యులు ఆరోగ్యరెడ్డి, అంజనీదేవి, నాగేశ్వర్, జేబాబేగం, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగార్షక బుట్ట.. పత్తి పంటకు రక్ష

జగదేవ్‌పూర్(గజ్వేల్): లింగార్షక బుట్టలు పత్తి పంట రక్షకు దోహదపడతాయని, పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వసంతరావు పిలుపునిచ్చారు. మండలంలోని చాట్లపల్లి రైతు వేదికలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గులాబీ పురుగు, సస్యరక్షణ చర్యలపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ పురుగు నివారణ కోసం రైతులు లింగార్షక బుట్టలను వాడాలన్నారు. మోతాదుకు మించి మందును పిచికారీ చేయవద్దని, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. 175 మంది రైతులకు లింగార్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణమూర్తి, ప్రేమ్ సతీశ్, పుష్పమిత్ర, రాజేందర్, కోఆర్డినేటర్లు రమేశ్, రాము, శ్రీకాంత్, బాలకృష్ణ, గణేశ్, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధులు అఖిలేశ్, లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్' ఓ మంచి అవకాశం



ప్రశాంత్‌నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): మధ్యలో చదువును నిలిపివేసినవారికి ఓపెన్ స్కూల్ విధానం ఒక మంచి అవకాశం అని, దానిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన కరపత్రం, పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 10వరకు అడ్మిషన్‌లకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి పాఠశాలలో జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌ల పోస్టర్‌లను ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

◆ వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం గిర్మాపూర్‌లో పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం గర్భగుడిలో అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. హోమాది కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు.

◆ ఈదురు గాలులతో కూడిన వర్షం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరాఫరాకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. వివిధ పనుల నిమిత్తం సిద్దిపేటకు వచ్చిన ప్రజలు తిరిగి తమ గ్రామాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.

◆ రైతులు ఆందోళన చెందొద్దు

మర్కూక్(గజ్వేల్): రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని, వ్యవసాయ అధికారులు రేషన్‌కార్డులు లేని రైతుల ఇంటికి వచ్చి వివరాలను సేకరిస్తారని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన ఎర్రవల్లి రైతు వేదికలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సందేహాలు ఉన్నా తమ వివరాలను ఏఈఓలకు అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

◆ పంచాయతీలుగా కొనసాగించాలి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు ఆర్‌అండ్ ఆర్ కాలనీలను పంచాయతీలుగానే కొనసాగించాలని కోరుతూ శనివారం ముంపు గ్రామాల నాయకులు ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు మాట్లాడుతూ అర్హత ఉండి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ రాని వారికి ప్యాకేజీ అందించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

◆ డ్రగ్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకుందాం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు, యువకులు డ్రగ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుందామని, వాటి నివారణకు అందరూ కృషిచేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ చైర్మన్ చంటి పిలుపునిచ్చారు. విశ్వతేజ కళాశాలలో మార్పు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మాదకద్రవ్యాలు నివారిద్దాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన జాతీయ అవార్డు గ్రహీత నర్సింహులు, అంబదాసు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆదివాసీల పాదయాత్రకు మద్దతు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం కార్యాలయానికి పాదయాత్ర చేపట్టిన పెందురు ధర్మ్‌కు తెలంగాణ జన సమితి నాయకులు సిద్దిపేట జిల్లా కేంద్రంలో తమ సంఘీభావం తెలిపారు. వారి పాదయాత్ర శనివారం సిద్దిపేటకు చేరుకున్న సందర్భంగా టీజేఎస్ నాయకులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పెందురు ధర్మ్ మాట్లాడుతూ ఆదివాసీల ప్రాంతాల్లో విద్య, వైద్యం, రోడ్డు సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, స్వామి పాల్గొన్నారు.

◆ దుబ్బాక ఏడీఏగా మల్లయ్య

దుబ్బాక: దుబ్బాక డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడుగా కంపటి మల్లయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏడీఏగా పనిచేసిన శ్యాంసుందర్ మెదక్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా భీంగల్ నుంచి మల్లయ్య ఇక్కడి వచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

◆ పంచాయతీగా చేయాలని వినతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామ శివారు కాలనీ ఎల్లదాసు నగర్‌ను ప్రత్యేక పంచాయతీగా చేయాలని కోరుతూ పలువురు కాలనీవాసులు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇచ్చామని, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి కూడా విషయం తెలియజేసినట్లు చెప్పారు.

◆ పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

దుబ్బాక: బాధితులు పోగొట్టుకున్న నాలుగు ఫోన్లను గుర్తించి శనివారం వారికి అప్పగించామని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. మండలంలోని రామక్కపేటకు చెందిన స్వామి, లచ్చపేటకు చెందిన యాదవరెడ్డి, డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన శంకర్, మల్లాయపల్లికి చెందిన కనకరాజు తమ ఫోన్లు పోగొట్టుకున్నామని ఫిర్యాదు చేశారని, సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిష్టర్‌చేసి ఫోన్లని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు కార్యక్రమంలో కానిస్టేబుల్ అమరేందర్ ఉన్నారు.